శాస్త్రవేత్తలుగా, అధ్యాపకులుగా ఎదగాలనుకుంటున్నారా? అయితే కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రతిష్ఠాత్మక సైన్స్ విద్యాసంస్థలు అందించే డ్యూయల్ కోర్సులు మీకో మంచి అవకాశం! బైపీసీ వారే కాదు, ఎంపీసీ, ఎంబైపీసీ వారు కూడా ఈ సీట్లకు పోటీపడవచ్చు. ఐదేళ్ల ఈ కోర్సుల ప్రత్యేకతలేమిటి? వీటిలో చేరే మార్గం ఏమిటి? ప్రవేశపరీక్షకు ఎలా సిద్ధం కావాలి? తెలుసుకుందాం!

ఐఐఎస్ఈఆర్‌లో ప్రవేశాలు



ప్రవేశపరీక్షలో ప్రశ్నలన్నీ విద్యార్థుల విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉండటం ఐఐఎస్ఈఆర్ ప్రత్యేకత. ప్రశ్నలు ఐఐటీ-జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ స్థాయిలో ఉంటాయి.

# చక్కని భవితకు సైన్స్ భళా!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) భారత ప్రభుత్వ అధీనంలో మానవ వనరుల అభివృద్ధి శాఖ విభాగంలో స్వతంత్రంగా పని చేసే విద్యాసంస్థలు. మన దేశంలో ఈ సంస్థలు బెరహంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, తిరుపతిల్లో ఉన్నాయి. ఈ 7 విద్యాసంస్థలూ సంయుక్తంగా 5 సంవత్సరాల డ్యూయల్ బ్యాచిలర్ సైన్స్-మాస్టర్ సైన్స్ కోర్సులను అందిస్తున్నాయి.



**ఎస్. కిరణ్‌కుమార్**
డైరెక్టర్, కెమ్‌బయోసిస్ కోచింగ్ సెంటర్

ఉన్నత ప్రమాణాలతో కూడిన సైన్స్ విద్య, పరిశోధన, శిక్షణ కోసం ఈ ఐఐఎస్ఈఆర్ విద్యాసంస్థలను మానవ వనరుల అభివృద్ధి శాఖ స్థాపించింది.

ఈ విద్యాసంస్థల్లో నాణ్యమైన, అధునాతన ప్రయోగశాలలు, జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌తో కూడిన అత్యాధునిక డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉంటాయి. పరిశోధన, బోధన రంగంలో విశేష అనుభవం కలిగిన అధ్యాపక బృందంతో శిక్షణ ఇస్తారు. ఫలితంగా సంబంధిత సైన్స్ కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసినవారికి అధిక వేతనాలతో కూడిన ఉద్యోగావకాశాలుంటాయి. వీరు బోధన రంగంలో అధ్యాపకులుగా, పరిశోధన సంస్థలు, పరిశ్రమల్లో శాస్త్రవేత్తలుగా స్థిరపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

గత ఏడాది ఐఐఎస్ఈఆర్ విద్యార్థులు పొగలేని దీపావళి మందుగుండు సామగ్రి తయారీలో విజయం సాధించారు.

## ఏ సబ్జెక్టుల్లో...

ఈ విద్యాసంస్థలు బేసిక్ సైన్స్ కోర్సులైన బయలాజికల్ సైన్స్, కెమికల్ సైన్స్, మేథమేటికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ మొదలైన సబ్జెక్టుల్లో 5 సంవత్సరాల డ్యూయల్ బీఎస్- ఎంఎస్ కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల్లో చేరటానికి 10+2లో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీతోపాటు ఇతర విద్యార్థులూ అర్హులే.

ఐఐఎస్ఈఆర్- భోపాల్‌లో డ్యూయల్ బీఎస్-ఎంఎస్, ఇంజినీరింగ్ సైన్స్ కోర్సును కూడా ప్రవేశపెడుతున్నారు. ఈ కోర్సుకు 10+2లో మేథమేటిక్స్ చదివినవారు అర్హులు.

ఐఐఎస్ఈఆర్- భోపాల్ ఈ ఏడాది నుంచి బ్యాచిలర్ సైన్స్ ఇన్ ఎకనామిక్ సైన్స్ కోర్సును ప్రవేశపెడుతోంది. ఈ కోర్సుకి 10+2లో మేథమేటిక్స్ చదివిన వారు అర్హులు.

ఈ విద్యాసంస్థల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు మొదటి రెండేళ్లు అన్ని బేసిక్ సైన్స్‌ల్లో సమగ్రంగా శిక్షణనిస్తారు. తరువాతి రెండేళ్లు ఎంపిక చేసుకున్న స్పెషలైజ్‌డ్ సైన్స్ సబ్జెక్టుల్లో విస్తృత పరిశోధన, బోధన, శిక్షణనిస్తారు. చివరి (అయిదో) సంవత్సరంలో రిసెర్చ్ ప్రాజెక్టు కూడా ఉంటుంది.

ఐఐఎస్ఈఆర్‌లో వివిధ బేసిక్ సైన్సెస్‌లో సమాజ హితానికి దోహదపడే అనేక అంశాలపై విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ సంస్థలు పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులను కూడా అందిస్తున్నాయి.

**ఎక్కడ? ఎన్ని సీట్లు?**

| ఐఐఎస్ఈఆర్ | సీట్ల సంఖ్య (2017) |
|---|---|
| బెరహంపూర్ | 100 |
| భోపాల్ | 260 |
| కోల్‌కతా | 200 |
| మొహాలీ | 200 |
| పుణె | 200 |
| తిరువనంతపురం | 200 |
| తిరుపతి | 125 |

## ఆప్టిట్యూడ్ పరీక్ష ఎలా?

ఈ పరీక్షకు ఎన్‌సీఈఆర్‌టీ 11, 12 తరగతుల బయాలజీ, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సిలబస్‌ను ప్రామాణికంగా తీసుకున్నారు.

ఆప్టిట్యూడ్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఈ ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో మాత్రమే ఉంటాయి.

ఈ ప్రవేశపరీక్ష ప్రశ్నపత్రంలో 4 సబ్జెక్టుల్లో (బయాలజీ, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) 15 ప్రశ్నల చొప్పున మొత్తం 60 ప్రశ్నలకు 3 గంటల సమయాన్ని ఇస్తారు. సరైన సమాధానం గుర్తించిన ప్రశ్నలకు +3 మార్కులు, ప్రతి తప్పు సమాధానానికి -1 రుణాత్మక మార్కులున్నాయి. గరిష్ఠ మార్కులు 180.

ఈ ఆప్టిట్యూడ్ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలి. మన తెలుగు రాష్ట్రాల్లో గత ఏడాది హైదరాబాద్, విజయవాడ, తిరుపతిల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. గత ఏడాది ఈ ఆప్టిట్యూడ్ పరీక్ష జూన్ 25న జరిగింది.

## ఇలా తయారవ్వాలి

విద్యావిధానం సమగ్రంగా ఉంటుంది కాబట్టి ప్రవేశపరీక్షలు కూడా ఆ స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నలన్నీ విద్యార్థుల విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉండటం ఐఐఎస్ఈఆర్ ప్రత్యేకత. ప్రశ్నలు ఐఐటీ-జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ స్థాయిలో ఉంటున్నాయి.

ఈ ప్రవేశపరీక్ష రాసేవారు మొదట ప్రాథమిక భావనలు, తెలుగు అకాడమీ, సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను రిఫర్ చేయాలి. బేసిక్ కాన్సెప్టులపై పట్టు సాధించాక అంశాలవారీగా రిఫరెన్స్ పుస్తకాల ద్వారా సబ్జెక్టును క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.

**బయాలజీ:** దీనిలో జనరల్ బయాలజీ, సెల్ బయాలజీ, జెనెటిక్స్, ఎకాలజీ అండ్ ఎవల్యూషన్, బయోటెక్నాలజీ, ఆనిమల్ ఫిజియాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, రిప్రొడక్షన్, డీఎన్ఏ ధర్మాలు, ఆర్‌డీఎన్ఏ టెక్నాలజీ, ట్రాన్స్‌లేషన్, ట్రాన్స్‌క్రిప్షన్ మొదలైన అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడుగుతున్నారు. వీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి.

**కెమిస్ట్రీ:** ఆర్గానిక్ కెమిస్ట్రీలో.. జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీ, నేమ్‌డ్ రియాక్షన్స్, ఎరోమ్యాటిసిటీ, కార్బోహైడ్రేట్స్, అమైనో యాసిడ్స్, పాలిమర్స్, ఫిజికల్ కెమిస్ట్రీలో మోల్ కాన్సెప్ట్, సొల్యూషన్స్, సాలిడ్ స్టేట్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ కైనెటిక్స్, థర్మోడైనమిక్స్ సంబంధిత అంశాలను అధ్యయనం చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పిరియాడిక్ ప్రాపర్టీస్, రసాయన బంధం, సంశ్లిష్ట సమ్మేళనాలు, ఎస్, పి బ్లాక్ మూలకాలు, డి, ఎఫ్ బ్లాక్ మూలకాలు, మెటలర్జీ మొదలైనవాటిపై దృష్టి అవసరం.

**ఫిజిక్స్:** జనరల్ ఫిజిక్స్, ఆప్టిక్స్, మోడరన్ ఫిజిక్స్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజమ్, మెకానిక్స్ సంబంధిత సిలబస్‌ను అనువర్తిత ధోరణిలో శ్రద్ధగా అధ్యయనం చేయాలి.

**మేథమేటిక్స్:** దీనిలో కాలిక్యులస్, త్రికోణమితి, కోఆర్డినేట్ జామెట్రీ, ఆల్జీబ్రా, వెక్టర్స్ సంబంధిత సిలబస్‌ను క్షుణ్ణంగా సాధన చేయాలి.

బట్టీ ధోరణిలో కాకుండా సబ్జెక్టును అవగాహన చేసుకుని విభిన్న అంశాలను అన్వయించగలిగితే విజయం సాధ్యపడుతుంది. సబ్జెక్టును ఇష్టపడి చదవాలి. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే ఆశించిన ర్యాంకు సాధించవచ్చు. మాదిరి ప్రశ్నపత్రాలకు www.iiseradmission.in ను చూడవచ్చు.



**మూడు దారులు**

**ఈ విద్యాసంస్థల్లో ప్రవేశానికి మూడు రకాల ప్రవేశ మార్గాలున్నాయి.**

**1** 2018-19 విద్యా సంవత్సరానికి ప్రామాణికమైన కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై) ఫెలోషిప్ పొందిన విద్యార్థులు అర్హులు (కటాఫ్ కూడా ఉండొచ్చు).

**2** జేఈఈ అడ్వాన్స్‌డ్ 2018లో కామన్ ర్యాంకు జాబితాలో 10,000 కన్నా తక్కువ ర్యాంకు సాధించిన జనరల్ అభ్యర్థులు, రిజర్వ్ కేటగిరీ వారి కేటగిరీ ర్యాంకులో 10,000 కన్నా తక్కువ ర్యాంకు సాధించినవారు మాత్రమే అర్హులు.

**3** స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డ్ (ఎస్‌సీబీ) మార్గంలో 2017, 2018ల్లో 10+2 విధానంలో సైన్స్ విభాగంలో సంబంధిత బోర్డు నిర్దేశించిన కటాఫ్ మార్కు లేదా అంతకన్నా ఎక్కువ సాధించిన వారు అర్హులు.

ఐఐఎస్ఈఆర్ 2017 ఎస్‌సీబీ మార్గంలో మన తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థులకు 97.3%, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు వారికి 95.4% కటాఫ్ మార్కుగా నిర్ణయించారు.

ఈ విద్యాసంస్థలో గరిష్ఠంగా 50% సీట్లను కేవీపీవై, జేఈఈ ద్వారా భర్తీ చేస్తారు. ఈ మార్గంలో మిగిలిన సీట్లతోపాటు మిగిలిన 50% సీట్లను ఎస్‌సీబీ మార్గంలో అర్హత పొందిన విద్యార్థులకు ఐఐఎస్ఈఆర్ ప్రత్యేక ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో చూపించే ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తారు.

## నోటీస్ బోర్డు

**ప్రభుత్వ ఉద్యోగాలు**

### సాయుధ బలగాల్లో 1223 ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టులు

నియామక సంస్థ: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ). **విభాగాలవారీ ఖాళీలు:** దిల్లీ పోలీస్‌లో ఎస్ఐ-150, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌లో ఎస్ఐ-1073, సీఐఎస్ఎఫ్‌లో ఎస్ఐ, ఏఎస్ఐ ఖాళీలను తర్వాత ప్రకటిస్తారు.

**అర్హత:** ఏదైనా డిగ్రీ, నిర్దేశించిన శారీరక ప్రమాణాలు, పురుష అభ్యర్థులకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్.

**వయసు:** 01.08.2018 నాటికి 20-25 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** రెండంచెల రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్/ ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ద్వారా.

**రాతపరీక్ష తేదీలు:** పేపర్ 1: 2018 జూన్ 4 నుంచి 10 వరకు, పేపర్ 2: 2018 డిసెంబరు 1.

**దరఖాస్తు:** ఆన్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.100

**చివరితేది:** 02.04.2018 **వెబ్‌సైట్:** www.ssconline.nic.in

### ఎంసీఈఎంఈ ఆర్మీ ప్రీ ప్రైమరీ స్కూల్

**పాఠశాల:** సికింద్రాబాద్ తిరుమలగిరిలోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ)కి చెందిన ఆర్మీ ప్రీ ప్రైమరీ స్కూల్ **పోస్టులు:** టీచర్, క్లర్క్ తదితరాలు. **ఖాళీలు:** 11

**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, బీఈడీ, పీజీ, ఇతర అర్హతలు. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. దరఖాస్తులు పాఠశాల కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి. **చివరితేది:** 20.03.2018. **వెబ్‌సైట్:** http://www.mcemeapps.com/

**ఫెలోషిప్స్**

### సీఎస్ఐఆర్-యూజీసీ నెట్, జూన్ 2018

**అర్హత:** ఆయా సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత.

**పరీక్ష నిర్వహించనున్న విభాగాలు:** 1) లైఫ్ సైన్సెస్ 2) ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్ అండ్ ప్లానిటరీ సైన్సెస్ 3) మ్యాథమేటికల్ సైన్సెస్ 4) కెమికల్ సైన్సెస్ 5) ఫిజికల్ సైన్సెస్.

**వయఃపరిమితి:** జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు. లెక్చరర్‌షిప్ అర్హతకు పరిమితి లేదు. **పరీక్ష తేది:** 17.06.2018 **ఆన్‌లైన్ దరఖాస్తు:** 05.03.2018 నుంచి 26.03.2018 వరకు

**వెబ్‌సైట్:** http://csirhrdg.res.in/

**ప్రవేశాలు**

### టీఎస్ ఈసెట్-2018

తెలంగాణలో 2018-19 విద్యా సంవత్సరానికిగానూ వివిధ వృత్తి విద్యా కళాశాలల యూజీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీకి నిర్వహించే పరీక్ష.

**కోర్సులు:** బీఈ/ బీటెక్/ బీఫార్మసీ.

**అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిప్లొమా లేదా బీఎస్సీ (మ్యాథమేటిక్స్). **ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా.

**ప్రవేశపరీక్ష తేది:** 09.05.2018 **ఆన్‌లైన్ దరఖాస్తు:** 05.03.2018 నుంచి 06.04.2018 వరకు

**వెబ్‌సైట్:** http://ecet.tsche.ac.in/

### నవోదయ విద్యాలయ సమితి

దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2018-19 విద్యా సంవత్సరానికి తొమ్మిదో తరగతి ప్రవేశాలు **అర్హత:** ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు.

**ప్రవేశపరీక్ష తేది:** 2018 మే 19. **దరఖాస్తు:** ఆన్‌లైన్

**చివరితేది:** 05.04.2018 **వెబ్‌సైట్:** http://nvshq.org/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**

# దివ్యమైన కెరియర్‌కు దారులివిగో!



**దేశంలో స్పీచ్ అండ్ హియరింగ్ కోర్సులకు మైసూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ సంస్థ ప్రఖ్యాతమైంది. దివ్యాంగులకు నాణ్యమైన విద్య, సేవలందించే సుశిక్షితులను తయారు చేసేందుకు ఈ సంస్థను ఏర్పాటుచేశారు. ఈ సంస్థలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయుల్లో పలు కోర్సులు ఉన్నాయి. పరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా ఎంపికచేస్తారు. ఇందులో చేరినవారికి ప్రతినెలా స్టైపెండ్ అందిస్తున్నారు.**

ఏఐఐఎస్‌హెచ్‌తోపాటు అనుబంధ సంస్థల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన వెలువడింది.

### ››› డిప్లొమా కోర్సులు

**1. డిప్లొమా ఇన్ హియరింగ్ ఎయిడ్ అండ్ ఇయర్ మౌల్డ్ టెక్నాలజీ**

**సీట్ల సంఖ్య:** 25 **అర్హత:** ఫిజిక్స్‌తో ఇంటర్ లేదా ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌ల్లో డిప్లొమా / ఐటీఐ లేదా డెంటల్ టెక్నీషియన్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు సంబంధిత అర్హత పరీక్షలో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. **వయసు:** జులై 1, 2018 నాటికి 24 ఏళ్లలోపు.

**2. డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్**

**సీట్ల సంఖ్య:** 25 **అర్హత:** ఏదైనా గ్రూప్‌తో ఇంటర్లో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. **వయసు:** 17 ఏళ్లు ఉండాలి.

**3. డిప్లొమా ఇన్ హియరింగ్, లాంగ్వేజ్ & స్పీచ్**

**సీట్ల సంఖ్య:** ఒక్కో సెంటర్‌లో 25 చొప్పున ఉంటాయి. ఈ కోర్సును ఏఐఐఎస్‌హెచ్‌తోపాటు మరో ఎనిమిది సంస్థల్లో నిర్వహిస్తున్నారు.

**అర్హత:** ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌తో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. **వయసు:** జులై 1, 2018 నాటికి 21 ఏళ్లలోపు.

ఈ కోర్సుల వ్యవధి ఏడాది. ఎంపికైనవారికి నెలకు రూ.250 చొప్పున పది నెలలపాటు స్టైపెండ్ చెల్లిస్తారు.

### ››› పీజీ డిప్లొమా

**1. పీజీ డిప్లొమా ఇన్ అగ్మెంటేటివ్ అండ్ ఆల్టర్నేటివ్ కమ్యూనికేషన్**

**అర్హత:** బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ / స్పెషల్ బీఎడ్ వీటిలో ఎందులోనైనా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

కోర్సు వ్యవధి ఏడాది. 20 సీట్లు ఉన్నాయి.

**2. పీజీ డిప్లొమా ఇన్ క్లినికల్ లింగ్విస్టిక్స్ ఫర్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ**

**అర్హత:** బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ / స్పెషల్ బీఎడ్ వీటిలో ఎందులోనైనా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

కోర్సు వ్యవధి ఏడాది. 10 సీట్లు ఉన్నాయి.

**3. పీజీ డిప్లొమా ఇన్ ఫోరెన్సిక్ స్పీచ్ సైన్స్ అండ్ టెక్నాలజీ**

**అర్హత:** బీఎస్సీ - ఫిజిక్స్ / మ్యాథ్స్ / ఎలక్ట్రానిక్స్ / కంప్యూటర్ సైన్స్ / ఫోరెన్సిక్ సైన్స్ / లేదా స్పీచ్ అండ్ హియరింగ్ ముఖ్యాంశంగా బీఎస్సీ / బీఏఎస్ఎల్‌పీ లేదా బీటెక్ - ఎలక్ట్రానిక్స్ / కంప్యూటర్ సైన్స్/ కమ్యూనికేషన్ లేదా ఎంబీబీఎస్ కోర్సు వ్యవధి ఏడాది. 10 సీట్లు ఉన్నాయి.

**4. పీజీ డిప్లొమా ఇన్ న్యూరో ఆడియాలజీ**

**అర్హత:** బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ కోర్సు వ్యవధి ఏడాది. 10 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులకు ఎంపికైనవారికి నెలకు రూ.500 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు.

**ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** మే 2
**పరీక్ష తేదీ:** మే 26
**వెబ్‌సైట్:** http://aiishmysore.in

### ››› బ్యాచిలర్ డిగ్రీ...

**I. బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ**

**సీట్లు:** ఏఐఐఎస్‌హెచ్‌లో 62, జబల్‌పూర్‌లోని ఎన్ఎస్‌సీబీఎంసీలో 10. **అర్హత:** ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌తో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఎంపికైనవారికి మొదటి మూడేళ్లు సంవత్సరానికి 10 నెలలపాటు నెలకు రూ.800 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. నాలుగో ఏడాది ఇంటర్న్‌షిప్‌లో భాగంగా నెలకు రూ.5000 చొప్పున చెల్లిస్తారు.

**2. స్పెషల్ బీఎడ్**

**సీట్లు:** 20 **అర్హత:** ఏదైనా డిగ్రీలో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత. అలాగే జులై 1, 2018 నాటికి అభ్యర్థి వయసు 30 ఏళ్లలోపు ఉండాలి.

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో చేరినవారికి నెలకు రూ.400 చొప్పున ఏటా పది నెలలపాటు స్టైపెండ్ చెల్లిస్తారు.